నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 | కరీంనగర్, బుధవారం 21 మే 2025 | JAGTIAL

## రాజకీయ దురుద్దేశంతోనే నోటీసులు

**జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత**

జగిత్యాల, మే 20 : రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాళేశ్వరం కమిషన్ రాష్ట్ర రాజకీయ దురుద్దేశంతోనే తొలిముఖ్యమంత్రి కేసీఆర్‌కు నోటీసులు ఇచ్చిందని జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత విమర్శించారు. ఈ మేరకు ఆమె మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రజా ప్రయోజనాల కోసం నిర్మించిన బృహత్ ప్రాజెక్టు కాళేశ్వరం అని గుర్తు చేశారు. తెలంగాణను కోటి ఎకరాల మాగాణంగా తీర్చిదిద్దడానికి కట్టిన ప్రాజెక్టే కాళేశ్వరం అని స్పష్టం చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు వల్ల తెలంగాణ రాష్ట్రం దేశానికే అన్నం పెడుతున్నదని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అని కొనియాడారు. పరిపాలన చేత కాక కాంగ్రెస్ ప్రభుత్వం కేసీఆర్‌పై ఆరోపణలు చేస్తున్నదని, త్వరలోనే కాలం అన్నింటికీ సమాధానం చెబుతుందని ఆమె స్పష్టం చేశారు.

## ఐఎఫ్ఎస్‌లో మెరిసిన 'ఖని' యువకుడు

**40వ ర్యాంకు సాధించిన అవినాశ్‌రెడ్డి**



తల్లిదండ్రులతో అవినాష్‌రెడ్డి

పెద్దపల్లి, మే 20( నమస్తే తెలంగాణ) : యూపీఎస్సీ ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ – 2024 ఫలితాలు మంగళవారం విడుదల కాగా, పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన సింగరేణి కార్మికుడి కుమారుడు అవినాశ్‌రెడ్డి సత్తా చాటాడు. గోదావరిఖని ఓసీపీ – 3లో ఫిట్టర్‌గా పనిచేస్తున్న చెరుకు నర్సింహారెడ్డి – రాజమణి దంపతుల చిన్న కూమారుడు మూడో ప్రయత్నంలో 40వ ర్యాంకు సాధించాడు. ఇతను మూడేళ్లుగా సొంతంగా సివిల్స్‌కు ప్రిపేర్ అవుతున్నాడు. ఇటీవల తెలంగాణ ప్రభుత్వం విడుదల చేసిన గ్రూప్–1 ఫలితాల్లోనూ 61వ ర్యాంకు సాధించాడు. ఎలాగైనా 25 ఏళ్లలోపే సివిల్స్ సాధించాలని లక్ష్యం పెట్టుకుని సాధించినట్లు అవినాశ్‌రెడ్డి 'నమస్తే తెలంగాణ'తో తెలిపాడు. మూడో ప్రయత్నంలోనే ఐఎఫ్ఎస్ సాధించినందుకు సంతోషంగా ఉందని చెప్పాడు.



## నర్మాలలో తాగునీటికి గోస

నర్మాలలో ట్యాంకర్ వద్ద నీళ్లు పట్టుకుంటున్న మహిళలు

గంభీరావుపేట, మే 20: గంభీరావుపేట మండలం నర్మాలలో తాగునీటికి తండ్లాడుతున్నారు. తాగునీరందించే బోరు మోటర్లు చెడిపోయినా బాగు చేయకపోవడంతో ఇరవై రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. దీంతో పంచాయతీ అధికారులు ట్యాంకర్ల ద్వారా ఇంటింటికీ నీరందిస్తున్నారు. అయితే మోటర్లను బాగుచేసి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని కాలనీ మహిళలు మొరపెట్టుకుంటున్నారు.

## మా వేతనాలు పెంచండి

- ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు
- కొనసాగుతున్న సమ్మె

మంథని, మే 20: అగ్రిమెంట్ ప్రకారం వేతనాలు పెంచాలని, రెండు జతల దుస్తులు ఇవ్వాలని, అందరికీ ఉచిత బస్సు పాసులు అందించాలని ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్లు డిమాండ్ చేశారు. ఈ మేరకు న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేపట్టిన సమ్మె మంగళవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చాలీచాలని వేతనాలతో తాము ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, అగ్రిమెంట్ గడువు పూర్తయినా తమకు వేతనాలు పెంచడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఆర్టీసీ సంస్థ స్పందించాలని, వెంటనే తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతున్నారు. ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మె శిబిరాన్ని సీఐటీయూ నాయకులు, ఇతర నాయకులు సందర్శించి తమ మద్దతు తెలిపారు.



ఆర్టీసీ అద్దె బస్సు డ్రైవర్ల సమ్మెకు మద్దతు తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు



## ఆశ కార్యకర్తల భిక్షాటన

భిక్షాటన చేస్తున్న ఆశ కార్యకర్తలు

చిగురుమామిడి, మే 20 : కనీస వేతనం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశకార్యకర్తలు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త నిరసన కార్యక్రమంలో భాగంగా కరీంనగర్ జిల్లా చిగురుమామిడి బస్టాండ్ వద్ద భిక్షాటన చేశారు. కేంద్ర ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, ఆశ కార్యకర్తల వేతనం పెంచాలని, మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని, ఆహార భద్రత, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు మారేళ్ల శ్రీలత, బెజ్జంకి సరోజన, బండారు సరోజన, పుష్ప, అంజలి, కవిత, తార, శ్వేత, సాహిదా బేగం, మంజుల, తిరుమల తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మో.. ఇల్లేదమ్మో..

- ఇండ్ల మంజూరులో మెలికల మీద మెలికలు
- దశాబ్దాల కింద వచ్చినా ఇప్పుడు నో చాన్స్
- గత లబ్ధిదారుల వివరాలు యాప్‌లో అప్‌లోడ్
- నాలుగు చక్రాల వాహనం ఉన్నా అంతే సంగతులు
- ఆధార్ కార్డుతో స్థితిగతుల పరిశీలన
- హుజూరాబాద్‌లో దళితబంధు లబ్ధిదారులపై తీవ్ర ప్రభావం
- సర్కారు తీరుపై మండిపడుతున్న నిరుపేదలు

కరీంనగర్, మే 20 (నమస్తే తెలంగాణ) : ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలంటే అనేక అడ్డంకులు దాటాల్సి వస్తున్నది. ప్రభుత్వం పెట్టిన మెలికల కారణంగా నిరుపేదలు ప్రయోజనం పొందలేని పరిస్థితి ఏర్పడుతున్నది. పైలెట్ గ్రామాల్లో ఇప్పటికే వడబోసి ఎంపిక చేసిన అధికారులు, 600 చదరపు అడుగులు దాటితే బిల్లులు వచ్చే పరిస్థితి లేదని తేల్చి చెబుతున్నారు. ఇక ఇతర గ్రామాల్లో రెండో విడుతగా ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసి ఇచ్చిన లబ్ధిదారుల జాబితాను కూడా ఇదే విధంగా వడబోస్తున్నారు. మెలికలతో అర్హుల జాబితా పూర్తిగా తగ్గిపోతున్నది. ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాల్లోనే అనేక కొర్రీలు పెట్టి, లబ్ధిదారుల జాబితాను తగ్గించాలని నిర్ణయించినట్టు అర్థమవుతున్నది. ఈ విషయం ఇప్పుడు గ్రామాల్లో చర్చనీయాంశంగా మారింది. గతంలో అంటే కాంగ్రెస్, టీడీపీ ప్రభుత్వాల సమయంలో ఇండ్లు పొందిన లబ్ధిదారులు ఇప్పుడు అనర్హులుగా తేలుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో 40 ఏండ్ల నుంచి ఇల్లు పొందిన వారి జాబితాను గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఇందిరమ్మ ఇండ్ల కోసం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో అప్‌లోడ్ చేసి పెట్టారు. గ్రామాల నుంచి లబ్ధిదారుల జాబితా రాగానే ఆన్‌లైన్‌లో పరిశీలిస్తున్నారు. దీంతో గతంలో లబ్ధిపొందిన వారి పేర్లు ఆటోమెటిక్‌గా బహిర్గతం అవుతుండడంతో ఈ పేర్లను అనర్హులుగా ప్రకటిస్తున్నారు. నలభై, యాభై ఏండ్ల కింద గృహ నిర్మాణ పథకం కింద ఇల్లు కట్టుకున్న వారికి అప్పటి పరిస్థితులు బట్టి ₹6 వేలు మాత్రమే ఇచ్చారు. ఆ తర్వాత పెంచుకుంటూ వచ్చారు. అయితే, చాలా మంది ఇండ్లు కట్టుకోకపోవడంతో ల్యాప్స్ అయ్యాయి. అయినా, వాటిని చూపి ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్లకు అనర్హులని అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఇల్లు మంజూరైనా తాము కట్టుకోలేదని నెత్తీనోరు మొత్తుకున్నా ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలను పాటించాల్సిందేనని అధికారులు చెబుతున్నారు. ఏండ్ల తరబడిగా ఇండ్లు లేక నిరీక్షిస్తున్న వందలాది నిరుపేదలు ప్రభుత్వం పెట్టే మెలికల కారణంగా అన్యాయానికి గురవుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### నాలుగు చక్రాల వాహనం ఉన్నా..

ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావాలంటే మరో కొత్త మెలిక పెట్టారు. కారు, వ్యాన్, ట్రాక్టర్, తదితర నాలుగు చక్రాల వాహనం ఉంటే ఇందిరమ్మ ఇంటికి అనర్హులుగా తేల్చేస్తున్నారు. ఆధార్ కార్డు ఆధారంగా ఇలాంటి వారిని గుర్తిస్తున్నారు. గతంలో కుటుంబాలు గడవడానికి బ్యాంకులు, ఫైనాన్స్‌లలో అప్పులు చేసి కారు, ఇతర ఫోర్ వీల్ వాహనాలు కొనుగోలు చేసుకున్న వారిలో చాలా మంది అమ్ముకున్నారు. కానీ, ఆన్‌లైన్‌లో మాత్రం వారికి వాహనాలు ఉన్నట్టు చూపుతున్నది. ఇలాంటి వారు తమకు ఫోర్ వీలర్ వాహనాలు లేవని అధికారుల చుట్టూ తిరుగుతున్నా వారు ససేమిరా ఒప్పుకోవడం లేదు. కార్లు, ఇతర ఫోర్ వీలర్స్ అమ్ముకున్నట్టు ఆధారాలు చూపాలని మెలిక పెడుతున్నారు. కొందరు వీటిని సమర్పించినా ఇప్పుడే ఎంపిక చేసేందుకు వీలు కాదని స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితులు దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేసిన హుజూరాబాద్ నియోజకవర్గంలో తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఇక్కడ 18,021 మందిని దళితబంధు కోసం ఎంపిక చేశారు. వీరిలో సుమారు 8 వేల మంది వాహనాలు కొనుగోలు చేసుకున్నారు. అందులో ఇండ్లు లేని దళితులు వందల సంఖ్యలో ఉన్నారు. అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం వీరికి పూర్తి సబ్సిడీపై వాహనాలు అందించింది. ఇప్పుడిప్పుడే ఆర్థికంగా స్థిర పడుతున్న దళితులు ఈ ప్రభుత్వంలో ఇస్తున్న ఇందిరమ్మ ఇల్లు కట్టుకుందామని ఆశిస్తే అందుకు ప్రభుత్వ నిబంధనలు మోకాలు అడ్డుతున్నాయి. ఈ నియోజకవర్గంలోని ఒక్కో గ్రామంలో 30 నుంచి 40 మంది ఇందిరమ్మ ఇండ్లకు అర్హులుగా ఉన్నారు. వీరిలో ఒక్కరిని కూడా అధికారులు ఎంపిక చేయడం లేదు. జాబితాలో పేర్లు రావడంతో ఉన్న ఇంటిని కూల్చుకున్న దళితులకు చావు కబురు చల్లగా చెప్పినట్టు 'మీకు దళితబంధులో వాహనాలు వచ్చిన కారణంగా ఇందిరమ్మ ఇల్లు రావడం లేదు' అని స్పష్టం చేస్తున్నారు. తాము ఇల్లు కట్టుకోలేని దీన స్థితిలో ఉన్నామని అధికారుల చుట్టూ తిరిగినా కనికరించడం లేదని హుజూరాబాద్‌కు చెందిన దళితులు వాపోతున్నారు. ఈ పరిస్థితి జిల్లా మొత్తంలో కనిపిస్తున్నది.

**ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో కాంగ్రెస్ ప్రభుత్వం మెలికల మీద మెలికలు పెడుతున్నది. ఎప్పుడో ఏండ్ల కింద మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల జాబితాను ప్రస్తుత యాప్‌లో అప్‌లోడ్ చేసి, వారికి ఇప్పుడు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నది. ఇక కారు, వ్యాను, ట్రాక్టర్, తదితర నాలుగు చక్రాల వాహనాలు ఉంటే కూడా అనర్హులుగా ప్రకటిస్తున్నది. ఆధార్ కార్డు ఆధారంగా కూడా పరిశీలించి, ఇలాంటి వారిని జాబితా నుంచి తొలగిస్తున్నది. దళితబంధు పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న హుజూరాబాద్‌లో ఈ నిబంధన తీవ్ర ప్రభావం చూపుతున్నది. ఈ పథకం కింద లబ్ధిపొందిన దళితులెవరికీ ఇళ్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. మొత్తంగా అనేక అవాంతరాలు దాటితే గానీ, సొంతింటి కళ నెరవేరేలా లేదు.**

### మంజూరై వదిలేసినా లెక్కేనా..?

గతంలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా ఇల్లు మంజూరై నిర్మించుకోకుండా వదిలేసిన నిరుపేదలకు ఇప్పుడు అన్యాయం జరుగుతున్నది. గతంలో మంజూరైన ఇండ్లకు ₹వేలల్లో మాత్రమే చెల్లించే వారు. కాంగ్రెస్ అధికారంలోకి రాక ముందు ఇంటి నిర్మాణానికి ₹5 లక్షలు ఇస్తామని చెప్పడంతో ఇల్లు లేని నిరుపేదలు ఆశ పడ్డారు. మొదటి విడుతగా మండలానికి ఒక పైలెట్ గ్రామాన్ని ఎంపిక చేసి అమలు చేస్తున్నారు. ప్రస్తుతం రెండో విడుతకు లబ్ధిదారుల ఎంపిక జరుగుతున్నది. ప్రతి నియోజకవర్గానికి 3,500 ఇండ్లు మంజూరు చేసే అవకాశాలు ఉంటాయని అధికారులు చెబుతుండగా, ప్రభుత్వం పెట్టిన నిబంధనల కారణంగా ఎంపికైన అనేక మందిని రిజెక్ట్ చేస్తున్నారు. అయితే, గతంలో ఇల్లు మంజూరై కట్టుకోకుండా వదిలేసిన వారికైనా మినహాయింపు ఇవ్వాలని నిరుపేద లబ్ధిదారులు కోరుతున్నారు. కొందరు అప్పట్లో ఎలాంటి బిల్లులు తీసుకోకున్నా తీసుకున్నట్టు ఆన్‌లైన్‌లో చూపుతున్నట్టు తెలుస్తున్నది. నాలుగు స్టేజీల్లో బిల్లులు తీసుకునేవారు. ఆ నాలుగు స్టేజీల్లో ఫొటోలు తప్పని సరిగా ఇవ్వాల్సి ఉంటుంది. కానీ, ఎలాంటి ఫొటోలు ఇవ్వకుండానే కొందరి పేర్ల మీద బిల్లులు చెల్లించినట్టు చూపుతున్నది. ముఖ్యంగా 2007–08లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసిన ఇండ్లలో చాలా మందికి బిల్లులు రాలేదు. కానీ, అధికారులు ప్రస్తుతం అప్‌లోడ్ చేసిన యాప్‌లో మాత్రం బిల్లులు తీసుకున్నారని చూపుతున్నట్టు తెలుస్తున్నది. ఇలాంటి లబ్ధిదారుల గురించి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపించి నిజానిజాలు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని పలువురు సూచిస్తున్నారు. కానీ, ప్రభుత్వం మాత్రం ఎంత మంది లబ్ధిదారులను తగ్గించుకుంటే అంత భారం తగ్గుతుందనే భావనలో కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలో అర్హత ఉన్నా వందలాది మంది నిరుపేదలకు అన్యాయం జరుగుతున్నట్టు స్పష్టమవుతున్నది.

## ధర్మపురిలో రాక్షస పాలన

**రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్**

ధర్మారం, మే20: ధర్మపురి నియోజకవర్గంలో రాక్షస పాలన నడుస్తున్నదని రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో ధర్మారం మండలంలో జరిగిన అభివృద్ధిపై చర్చించి, ప్రెస్‌మీట్ పెట్టేందుకు తమ పార్టీ నాయకులు అంబేద్కర్ చౌరస్తాకు వస్తుంటే కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించడాన్ని మంగళవారం ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. తెలంగాణ రాష్ట్రాన్ని బీఆర్ఎస్ పదేండ్లపాలనలో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన నాయకుడు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ అని కొనియాడారు. అధికారం కోసం ఆచరణ సాధ్యంకాని హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన పార్టీ కాంగ్రెస్ అని దుయ్యబట్టారు. నిజంగా ఆ పార్టీ నాయకులకు నీతి, నిజాయితీ ఉంటే, ప్రజలు, తమ పార్టీ నాయకులు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ధర్మపురి ఎమ్మెల్యేగా అడ్లూరి లక్ష్మణ్ కుమార్ గెలిచి ఏడాదిన్నర కావస్తున్నా ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదని, తట్టెడు మట్టి తీయలేదని ఆరోపించారు. ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దగ్గర పైసలు లేవని, తనను కోసినా ఒక్క పైసా రాదని అన్నాడని, దీనిని బట్టే కాంగ్రెస్ పరిస్థితి ఏంటో అర్థమైతున్నదని చెప్పారు. ధర్మపురి నియోజకవర్గంలో ఏడాదిన్నరలో ఏం సాధించారో, ఏం పనులు చేశారో చెప్పకుండా కాంగ్రెస్ నాయకులు ఎందుకు రెచ్చిపోతున్నారో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు అమలు చేయకుండా, ప్రశ్నిస్తున్న తమ పార్టీ నాయకులపై దాడులకు దిగడం మంచి పద్ధతికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి సంఘటనలను ఎవరూ క్షమించరని, పదేండ్ల బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను ఎలాంటి కక్ష సాధింపు చర్యలు చేయలేదని గుర్తు చేశారు. ఎమ్మెల్యే లక్ష్మణ్ కుమార్ ఎంత అభివృద్ధి చేస్తారో చేసి చూపించాలే కానీ, ఇలా భౌతిక దాడులకు ఉసిగొల్పి ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతానంటే సహించేది లేదని హెచ్చరించారు.



కరీంనగర్: కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

## సీవోఈ అలుగునూర్‌లోనే కొనసాగించాలి

**కలెక్టరేట్ ఎదుట ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ ధర్నా**

కరీంనగర్ కమాన్‌చౌరస్తా, మే 20 : కరీంనగర్ జిల్లా అలుగునూర్ సీవోఈలో కో–ఎడ్యుకేషన్ రద్దు చేస్తూ బాలుర వసతి గృహాన్ని వేరే ప్రాంతానికి తరలించడం సరికాదని, ఆ నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కమిటీల బాధ్యులు మంగళవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉత్తమ విద్యను దూరం చేసే కుట్రను మానుకోవాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ధర్నాలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్ సాగర్, నాయకులు వరుణ్, సందేశ్, శివకుమార్, ఏఐఎస్ఎఫ్ నగర ఉపాధ్యక్షుడు కసిరెడ్డి సందీప్, వినయ్, సాయి, టీజీపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర నిజ నిర్ధారణ కమిటీ కన్వీనర్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్‌చార్జి దార మధు, తల్లిదండ్రులు బోయిని సది, చిప్పకుర్తి వెంకట్ స్వామి, కునమల్ల కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

### గోసపెడ్తున్నరు



నేను పొద్దుగాల వచ్చిన. రెండు గంటల నుంచి నిల్చున్నా లైన్ రాలేదు. నాకు మూడెకరాల భూమి ఉన్నది. 2.5 ఎకరాలకు ఒక బ్యాగు ఇస్తున్నరు. సబ్సిడీ ధర అంటున్రు. కానీ, ఇంతకు ముందు ₹1125 ఉన్న ధర ఉంటే ఇప్పుడు ₹2136కు పెంచి అమ్ముతున్నరు. ఇగ ఇదేం సబ్సిడో ఏమో. వాళ్లకే తెల్వాలె. రైతులనైతే గోసవెడ్తున్నరు.

**- వంగల అంజిరెడ్డి, రైతు (గొల్లపల్లి)**

### అవి ఏం సరిపోతయ్..



ఏప్రిల్‌ల రావాల్సిన జీలుగ విత్తనాలు పంపుడు ఈడికే లేట్టైందంటే.. మళ్లీ తక్కువ పంపిన్రు. విత్తనాల కోసం గింతగనం లైనుంటదా..? నాకు ఏడెకరాల భూమి ఉన్నది. మూడు బ్యాగులు కావాలె. మరి ఇస్తరో ఏమంటరో.. సెంటర్‌కు 250 వస్తే ఎక్కడ సరిపోతయ్. ఇవన్నీ అయిపోతె మల్ల ఎప్పుడస్తయో ఏమో. ఇవి ఇప్పుడు వేస్తే 45 రోజుల టైం తీసుకుంటది. వానకాలం పంట వేసేయాళ్లకు జీలుగ పెరగాలి. ఇది లేటయితే పంట లేటయితది. రైతుకు ఇబ్బందైతది.

**- వంగల నర్సింహారెడ్డి, రైతు (గొల్లపల్లి)**


ఎల్లారెడ్డిపేటలో జీలుగ విత్తనాల కోసం కొనుగోలు కేంద్రం వద్ద గుమిగూడిన రైతులు

- వచ్చిందే లేటు.. ఆపై అరకొర.. అడ్డగోలు రేటు
- జీలుగ కోసం రైతుల అవస్థలు

## 1200 బ్యాగులకు 500లే!

ఎల్లారెడ్డిపేట, మే 20 : జీలుగ విత్తనాల పంపిణీలో ఆలస్యం జరుగుతున్నది. ఏప్రిల్‌లో అందించాల్సి ఉన్నా.. నేటికీ అరకొరే ఇస్తుండడంతో రైతులు ఇబ్బంది పడాల్సి వస్తున్నది. ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామాలకు దాదాపు 1200 బ్యాగులు అవసరముండగా, మంగళవారం కేవలం 500 బ్యాగులే వచ్చాయి. నెలన్నర ఆలస్యమైనా అంతతే వచ్చాయి. అందులో ఎల్లారెడ్డిపేటకు చెందిన వీవోకు 250, కోరుట్లపేట వీవోకు 250 చొప్పున అందించగా, మండల కేంద్రానికి రైతులు సంఖ్యలో తరలివచ్చారు. గంటలపాటు బారులు తీరారు. గతంలో ₹1125 ఉన్న బ్యాగును సబ్సిడీ అని చెప్పి ఇప్పుడు ₹2136కు అమ్ముతున్న విషయం తెలుసుకుని ఆగ్రహించారు. తక్కువ బ్యాగులు రావడం, రైతులు ఎక్కువ సంఖ్యలో ఉండడంతో వారిని చూసి చాలా మంది వాపస్ వెళ్లిపోయారు. ఈ విషయమై వ్యవసాయాధికారులను సంప్రదించగా, ఇండెంట్ పెట్టామని రెండు, మూడు రోజుల్లో వస్తాయని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సరైన సమయంలో తక్కువ ధరకు తీసుకెళ్లిన రోజులను గుర్తు చేస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ పనితీరు సరిగ్గా లేదని, రైతులను గోసపెడుతున్నదని మండిపడ్డారు.


ధర్నాలో పాల్గొన్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు, మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్

## ధాన్యం వెంటవెంటే కొనండి

- పొత్తూర్‌లో రైతుల ధర్నా
- పాల్గొన్న జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు

ఇల్లంతకుంట, మే 20 : ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వీడాలని, వెంటవెంటే కొనాలని పొత్తూర్ గ్రామ రైతులు రోడ్డెక్కారు. పెద్దసంఖ్యలో గ్రామ జంక్షన్ వద్దకు చేరుకొని ధర్నా చేశారు. తూకంలో జాప్యం చేస్తున్నారని, జోకిన వడ్లను తీసుకెళ్లడానికి లారీలు రావడం లేదని, గన్నీ సంచుల కొరత ఉందని ఆవేదన చెందారు. కొనుగోళ్లలో వేగవంతం చేసి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జడ్పీ మాజీ వైస్ చైర్మన్ సిద్ధం వేణు అక్కడకు చేరుకొని, ధర్నాలో పాల్గొని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సమస్యలు ఉన్నాయని, ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన చెందారు. గన్నీ సంచులు లేవని, లారీలు రావడం లేదని, హమాలీల కొరత ఉందని చెప్పారు. అయినా ఎవరూ పట్టించుకొనే వారు లేక అన్నదాతలు ఆగమవుతున్నారన్నారు. అకాల వర్షాలు వెంటాడుతున్నాయని, వానకాలం దగ్గర పడుతున్నదని కొనుగోళ్లు వేగవంతం చేయాలని సూచించారు. మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ స్పందించి రైతులను ఆదుకోవాలన్నారు. రైతులను నిర్లక్షం చేస్తే ఉద్యమిస్తామని హెచ్చరించారు. అనంతరం పోలీసులు ధర్నా వద్దకు చేరుకుని రైతులతో మాట్లాడి విరమింపజేశారు. ధర్నాలో మాజీ సర్పంచ్ సిద్ధం శ్రీనివాస్, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కదురు శేఖర్, నాయకులు పట్నం శ్రీనివాస్, బండారి మహేశ్, రైతులు చెరుకు రాజు, నారయణ రెడ్డి, మల్లారెడ్డి, రాజయ్య, నర్సయ్య, సాంబశివ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, మోహన్ రెడ్డి, గౌరయ్య, రవి, అంజయ్య, సాగర్ తదితరులు ఉన్నారు.